TITLE CODE: APTEL16281

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 203 | ఎడిటర్ : ఎం. రమేష్ | సోమవారం, జూన్ 24, 2024 | పేజీలు : 04 | వెల రూ. 5.00/-

# కూరగాయల ధరలు పైపైకి

## అమాంతంగా పెరిగిన టమాటా ధరలు తగ్గిన దిగుబడులతో ధరలకు రెక్కలు

**విజయవాడ, జూన్ 23 (పీపుల్స్ మోటివేషన్):**





వర్షాభావంతో మార్కెట్లలో కూరగాయల ధరలు భగ్గుమంటు న్నాయి. పంటల దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి..వర్షాలు పడకపోవడంతో కొత్త పంటలకు ఇంకా సమయం ఉంది. రూ.100కు రెండు, మూడు కూరగాయలు కూడా రావడం లేదు. వ్యాపారులను అడిగితే పంట తగ్గిపోయిందని చెబుతున్నారు. ఒక పక్క ఎండ సెగ..మరో పక్క కూరగాయల ధరల మంట చూసి నగరవాసులు ఉసూరుమనాల్సి వస్తోంది.. ఎండల తీవ్రత కూరగాయల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపింది. కూరగాయలు పండించే రైతులకు నీరందక వందలాది ఎకరాల్లో పంట ఎండిపోయి దిగుబడి తగ్గిపోయింది. ఫలితంగా కూరగాయల ధరలు పెరిగిపోయాయి. ప్రజలు నిత్యం వినియోగించే టమాటా చుక్కలు చూపిస్తోంది. ఇప్పటికే మళ్లీ 50 నుంచి 75 రూపాయలకు చివరకు వంద కిలో పెరిగింది. నిత్యం వాడే ఉల్లి ధరలు మళ్లీ 35పైనే పలుకుతన్నాయి. ఎండాకాలంలో పంటల విస్తీర్ణం పరిమితమైంది. దిగుబడి కూడా సగానికి తగ్గి ఉత్పత్తి పడిపోయింది. దీంతో నగరానికి రావాల్సిన కూరగాయల దిగుబడి కూడా గణనీయంగా తగ్గిందని అంటున్నారు. వేసవి ప్రభావం తీవ్రంగా ఉండటంతో భూమిలోని తేమ గంటల వ్యవధిలో ఆవిరవడంతో పంటలకు నీరు అందని పరిస్థితి ఉంది. భూగర్భ జలాలు వేగంగా అడుగంటి పోవడంతో బోర్లు ఉన్నా పనిచేయడం లేదు. ఎండ తీవ్రతకు,వడ గాలులకు వచ్చిన పూత కూడా రాలిపోవడంతో కాయలుకాయడం లేదని అంటున్నారు.

టమోటా క్రేటు (30కిలోలు) ధర గతంలో రూ. 200 నుంచి రూ.300 ఉండగా ఇప్పుడు రూ.1200 పలుకుతోంది. కాకర,బెండ,బీర, ధరలు పావుకు 30కి తక్కువగా లేవు. బీన్స్ వందకు పావు అమ్ముతున్నారు. అన్ని కూరగాయల ధరలు దాదాపు ఇదే తీరులో పెరిగాయి. టమోటా, బీర, గోరు చిక్కుడు సాగు చేసిన రైతులు అప్పు చేసి పెట్టుబడి పెట్టారు. తీరా ఇప్పుడిప్పుడే కాపు మొదలైందనుకున్న దశలో ఎండలకు ఉన్న పంట కాస్తా చేతికందకుండా పోతోంది. ఎండ తీవ్రత కారణంగా పంట ఎండిపోయిది. పెట్టుబడి కూడా చేతికి వస్తుందన్న నమ్మకం లేదని కూరగాయల రైతులు వాపోతున్నారు. ఎండల తీవ్రత ఇదే స్థాయిలో ఉండి, వర్షాలు పడకపోతే భూగర్భ జలాలు మరింత తగ్గిపోయి పంటలు ఎండిపోతాయి. ఇప్పటికే 80 శాతం కూరగాయల పంటలు ఎండిపోయే దశలో ఉన్నాయి. దిగుబడి ఇంకా పడిపోయి మార్కెట్‌కు కూరగాయలు రావడం కష్టమయ్యే పరిస్థితులు నెలకొని ఉన్నాయని నగర మార్కెట్లకు సరఫరా చేస్తున్న వ్యాపారులు అంటున్నారు. ఇలాగే ఎండలు కొనసాగితే ధరలు మరింతగా మండే ప్రమాదం కనిపిస్తోంది.

# రాష్ట్రానికి పరిశ్రమలు రాబోతున్నాయి..

### రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్

**కర్నూలు, జూన్ 23 (పీపుల్స్ మోటివేషన్):-**



ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ చెప్పారు. కర్నూల్లో టి.జి లక్ష్మీ వెంకటేష్ వాసవి వైశ్య హాస్టల్ నూతన ప్రారంభోత్సవం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టి.జి భరత్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ప్రజలకు మంచి చేస్తారన్న నమ్మకంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ తనకు మంత్రి పదవి ఇచ్చారని పేర్కొన్నారు. సరైన నాయకత్వంలేక గడిచిన ఐదేళ్లలో రాష్ట్రానికి పరిశ్రమలు రాలేదన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డాక పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని మంత్రి చెప్పారు. వారందరితో చర్చలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ఇక కర్నూల్లో ఉన్న ఇండస్ట్రియల్ జోన్ కు పరిశ్రమలు తీసుకొచ్చేలా కృషి చేస్తామన్నారు. తనను ఆశీర్వదించిన ప్రజలందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ఈ జీవితం అశాశ్వతం! (ఆధ్యాత్మికచింతన)

**తిరుమల:** విత్తనం చెట్టును కంటుంది. దాన్ని గూడులా భావిస్తుంది. తరవాత అదే చెట్టు పండ్లలోకి వెళ్ళి తలదాచుకుంటుంది. ఎండిన ఆకులు రాలిపోతుంటాయి. కొత్త చిగుళ్లు పుట్టుకొస్తుంటాయి. ఒక రోజు అంతెత్తు వృక్షమూ కుప్పకూలిపోతుంది. అంతకన్న ముందే విత్తనం చెట్టు పండ్ల లోంచి బయటపడుతుంది. మరోచోట ఇంకో చెట్టుగా జన్మ ఎత్తుతుంది. మనిషి జీవితమూ అంతే. సూక్ష్మాతి సూక్ష్మ చైతన్య విత్తనం మనిషి రూపంలో గూడు అల్లుకుంటుంది. ఆ దేహంలోంచి రోజూ కొన్ని కణాలు చనిపోతుంటాయి. కొత్త కణాలు వస్తుంటాయి. ఆయుష్షు నిండాక ఒకనాడు ఆ మనిషి ఊపిరి తీసుకోవడం ఆగిపోతుంది.మనిషి శరీరంలో మరణించిన కణాలు- గోళ్లు, వెంట్రుకల రూపంలో వెళ్లిపోతుంటాయి. వాటిని కత్తితో కోసినప్పుడు నొప్పి అనిపించకపోవడానికి కారణం- అవి నిర్జీవాలు. ఇలా చిన్న చిన్న విషయాలు తెలిసినప్పుడు మనసు సంతోషంతో నిండిపోతుంది.

## పోలవరం నిర్మాణాన్ని..

# సవాల్‌గా తీసుకోవాలి

### నిర్వాసితులను ఆదుకోవడంలో ముందుండాలి

### చంద్రబాబుకు ప్రతిష్టాకంగా మారిన నిర్మాణం


**ఏలూరు, జూన్ 23 (పీపుల్స్ మోటివేషన్):**




పోలవరం జాతీయ ప్రాజెక్ట్. దీనిని పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిది. అలాగే సకాలంలో నిధులు విడుదల చేసి పూర్తి చయాల్సి ఉంది. విభజన జరిగి 10 ఏళ్లు పూర్తయ్యింది. అయినా సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. సిఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టగానే గత సోమవారం పోలవరం సందర్శించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఇందులో ప్రధానంగా ప్రాజెక్టును పూర్తిచేయడంతో పాటు, అంతే చిత్తశుద్ధితో పునరావాస చర్యలు తీసుకోవాలి. భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి గౌరవప్రదంగా పునరావాసం కల్పించాలి. పోలవరం నిర్వాసితులను ఆదుకోవడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. ఈ క్రమంలో పోలవరం పోరుకేక చేపట్టి సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తేవడంలో లెఫ్ట్ పార్టీలు బాగా కృషి చేశాయి. పోలవరం నిర్వాసితుల సమస్యలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేశారు. పోలవరం పోరుకేక నిర్వాసితుల్లో కొంత భరోసా కల్పించింది. పోలవరం అవకతవకలు లేదా నిధుల దుర్వినియోగం ఉంటే ఎపి ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు. నిధుల దుబారాను అరికట్టవచ్చు. కానీ పోలవరం సందర్శించడం కూడా నేరంగా పరిగణించి దానిని జరుపకూడదన్న రీతిలో గత వైసిపి ప్రభుత్వం చంద్రబాబుపై ఆంక్షలు పెట్టడం అబివృద్దిని అడ్డుకోవడం తప్ప మరోటి కాదు. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వచ్చారు కనుక ఇప్పుడు పోలవరం ప్రధాన బాధ్యతగా తీసుకున్నారు. ఎపి అంటే అమరావతి, పోలవరం అన్న సంకల్పం తీసుకున్న చంద్రబాబు అందుకు అనుగుణంగా ముందుకు సాగాలి. ఇటీవలే పోలవరం నిర్మాణాలను పరిశీలించిన బాబు దాదాపు 70శాతం నిర్మాణాలు తన హయాంలోనే పూర్తి కావచ్చాయని ప్రకటించారు. చంద్రబాబు మొదటినుంచీ పోలవరం ప్రాజెక్టును ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మాట నిలబెట్టుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఐదేళ్లయినా జగన్ పోలవరం పూర్తి చేయలేక పోయారు. కేంద్రంలో ఇప్పుడు చంద్రబాబు మళ్లీ చక్రం తిప్పే అవకాశం ఉంది. అందువల్ల పోలవరం నాలుగైదేళ్లలో పూర్తయ్యేలా యుద్ధప్రాతిపదికన ముందుకు సాగాల్సి ఉంది.


# విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..





పీపుల్స్ మోటివేషన్ తెలుగు దినపత్రికలో

## నియోజకవర్గ ఇంచార్జ్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను..

## సంప్ర : 80086 22746


తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

## ఘనంగా డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు: రవి కుమార్

**దేవనకొండ, జూన్ 23 (పీపుల్స్ మోటివేషన్):-**



అయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న బీజేపీ దేవనకొండా మండల అధ్యక్షులు బోడా రవి కుమార్, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ త్యాగాలను స్మరించుకుంటూ వీరు జాతీయవాదనేతలలో గొప్ప నాయకుడని ఈయన కూడా ఒక ముఖ్య జాతీయవాది అలాగే భారతీయ రాజకీయనాయకుడు, న్యాయవాది మరియు మంచి విద్యావంతుడు వీరు 1951లో భారతీయ జన సంఘ్ పార్టీ స్థాపించారు ఈయన ఆధునిక హిందుత్వజాతీయవాదిఅని తెలియజేశారు కార్యక్రమంలో కాంతు, దయాకర్, హరి, ఉసీని, నాగరాజు పాల్గొన్నారు.

## రుణమాఫీతో ఆనంద ఉత్సవాలలోరైతులు

**2 లక్షల రుణమాఫీ క్యాబినెట్ ఆమోద ప్రకటన**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం**

**ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు**



**పెబ్బేరు, జూన్ 23 (పీపుల్స్ మోటివేషన్):-**

పెబ్బేరు మున్సిపల్ పట్టణంలో సుభాష్ చంద్రబోస్ చౌరస్తాలొ రైతుల సంబరాలు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో బాగా రైతులకు ?2లక్షల ఏకకాల రుణమాఫీఆగస్ట్ 15 వ తేదీన అంటూ ప్రకటన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వనికి ధన్యవాదములు తెలుపుతూ,పెబ్బేరు మండల కేంద్రంలో రైతన్నలు భారీ ఎత్తున ఎద్దుల బండ్ల ప్రదర్శనచేసి, సీఎం, రేవంత్ రెడ్డివ్యసాయ శాఖ మంత్రి, ఎమ్మెల్యే ల చిత్ర పటలు ఊరేగించి, ఏకకాలంలో రైతులకు పార్టీకే సాధ్యం సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వం తీసుకున్న 31 వేల కోట్ల తో రెండు లక్షల రైతు రుణమాఫీ, నిర్ణయం పట్ల రైతులుహర్షం వ్యక్తం చేశారు. రైతుల పై కాంగ్రెస్ ప్రభుత్వానికి వున్న చిత్తశుద్ధి కి, ప్రతిగా సుభాష్ చౌక్ లో పాలభిషేకం చేసి, స్వీట్ లు పంచుకుని సంబరాలు చేసుకుని, అనంతరం,ఈ కార్యక్రమం లో భారీ సంఖ్యలో రైతులు కాంగ్రెస్ నేతలు, నాయకులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో కరెంట్ షాక్‌తో ఆవు మృతి

**విద్యుత్ సంబంధిత అధికారులపై చర్య తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్**

**పెబ్బేర, జూన్ 23 (పీపుల్స్ మోటివేషన్):-**



పెబ్బేరు మండల పరిధిలోని గుమ్మడంలో విద్యుత్ అధికారులను నిర్లక్ష్యంతో పది రోజుల క్రితం తెగిపడిన వైరును , గ్రామ సభలో సంబంధిత విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చినప్పటికీ లో టెన్షన్ వైర్ కు విద్యుత్ సరఫరా నిలిపి వేయకపోవడంతో గొల్ల రాముడికి చెందిన 70 వేల రూపాయల విలువగల గోవు కరెంట్ షాక్ తో చని పోయింది. పది రోజుల క్రితం తెగిపడిన లో టెన్షన్ విద్యుత్ వైర్ సమీపంలో ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ పనులు నిమిత్తం రైతులు, అదే కాలిబాట వెంట నిత్యం పనుల నిమిత్తం తిరిగేవారు. సంబంధిత విద్యుత్ లైన్మెన్ దృష్టికి తీసుకువచ్చిన నిర్లక్ష్యంతో మూగజీవి ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన విద్యుత్ సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# మాటిచ్చాం చేసి చూపిస్తున్నాం







**వనపర్తి జిల్లా అధ్యక్షులు శ్రీరంగాపూర్ జెడ్పిటిసి ఎం. రాజేంద్రప్రసాద్ యాదవ్**

**ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ కీలక నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి కీ పాలాభిషేకం**

**శ్రీరంగాపూర్/ వనపర్తి, జూన్ 23 (పీపుల్స్ మోటివేషన్):-**

శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మండల రైతు కమిటీ అధ్యక్షులు పసుల రాముడు గారి ఆధ్వర్యంలో మొన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఏకకాలంలో 2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి మంత్రి మండలికి సీఎం రేవంత్ రెడ్డి కీ పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేసిన శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ నాయకులు రైతులు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వనపర్తి జిల్లా అధ్యక్షులు శ్రీరంగాపూర్ జడ్పిటిసి ఏం.రాజేంద్ర ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు .వారు మాట్లాడుతూ మొన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తీసుకున్న రైతు రుణమాఫీ నిర్ణయం తెలంగాణ చరిత్రలోనే చారిత్రాత్మక రోజుగా నిలుస్తుందని అన్నారు. రైతు రుణమాఫీపై కీలక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానిపై రైతులంతా సంతోష వ్యక్తం చేస్తున్నారు అని అన్నారు. గత ప్రభుత్వంలో రుణమాఫీ చేస్తాం అని మాయమాటలు చెప్పి మోసం చేసిన ప్రభుత్వం గత ప్రభుత్వాలకు దక్కుతుందని వారు ఎదవ చేశారు. ఈ కార్యక్రమంలో కంబళపూర్ ఎంపీటీసీ ఎల్లస్వామీ, శ్రీ రంగాపురం మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు విష్ణు,అశోక్ రెడ్డి, రామచంద్రి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కుమ్మరి గోవింద్,పట్టణ కాంగ్రెస్ నాయకులు రామరాజు,తిరుపతయ్య, బహుజన రమేష్,బొక్కలయ్య, గంగన్న,విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు కొంపెల్ల

శ్రీ శ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) పేరు ఎరుగని తెలుగువాడు ఉండడంటే అతిశయోక్తి కాదు. పండితుల చర్చాగోష్టుల్లోనూ, ప్రాచీన గ్రంథాలలో, రాజ ఆస్తానాలలో, మాత్రమే ఆదరణకు నోచుకున్న తెలుగు సాహితీ గొప్పతనాన్ని, వైభవాన్ని సామాన్యుడి చెంతకు చేర్చిన ఘనత మహాకవి శ్రీ శ్రీదే.. తెలుగు సాహిత్యంలో సామాన్యుడి కష్టనష్టాల గురించీ, పేదసాదల జీవితాలని ప్రతిబింబించే కవిత్వాన్ని రాసిన మొదటి కవిగా ఆయన చిరస్మరణీయుడు. ఆయన రచనల్లో 1950 లో ప్రచురించ బడిన 'మహాప్రస్థానం' అనే కవితా సంపుటి తెలుగు సాహితీ అభిమానుల మనసుల్లోనే కాకుండా.. సామాన్య ప్రజల గుండెల్లో కూడా చిరస్థాయిగా నిలిచిపోతుంది. అయితే శ్రీశ్రీకి కొత్త మార్గ నిర్దేశనం చేసింది కొంపెల్ల జనార్ధనరావు అనే విషయం చాలా మందికి తెలియదు. ఒక గొప్పస్థాయి పత్రికగా స్వయంగా రూపుదిద్దిన 'ఉదయిని పత్రికలో మహాప్రస్థానగీతాలలోని మొదటిగేయం 'నేను సైతం' (జయభేరి) గీతంను అచ్చువేయడం విశేషం. 1928లో శ్రీశ్రీ రచించిన తొలి కావ్యం 'ప్రభవ' ను కొంపెల్ల సమీక్షిస్తూ తీవ్రంగా వ్యతిరేక విమర్శలు చేశారు. శ్రీశ్రీ ఇంకా సుదీర్ఘ సమాసాలు తగ్గించాలని, సంస్కృతం ఎక్కువైందని, అనుకరణ వద్దని' స్పష్టం చేశాడు కొంపెల్ల. అప్పటికి శ్రీశ్రీ... కృష్ణశాస్త్రి విశ్వనాధల ప్రభావంలో కొట్టుకు పోతున్న వేళలో శ్రీశ్రీలో...సొంతగొంతుక కావాలన్న స్పృహను పటిష్ఠ పరిచింది కొంపెల్ల సద్విమర్శనే.

ఆ విమర్శల వల్లనే కలిసి వీరిద్దరు విడిపోని స్నేహితులు అయ్యారు. ఆప్త మిత్రులయ్యారు. అప్పటి నుంచి 1937లో కొంపెల్ల మరణించేవరకూ వారిద్దరి స్నేహం కొనసాగింది. భావ కవితను పల్లెత్తుమాటంటే భరించలేని రోజులలో శ్రీ శ్రీ 'సుప్తాస్థికలు' కవిత రాసారు. దాన్ని 'భారతి'కి పంపిస్తే అది తిరుగు టపాలో ఇంటికి చేరింది. పంపేసింది. కవితాధోరణిని మార్చడానికి తాను సిద్ధంగా ఉన్నా- కొత్త భావాన్ని స్వీకరించడానికి ఎవరూ సిద్ధంగా లేరని శ్రీశ్రీ గ్రహించారు. శ్రీశ్రీకి ఏదో తపన. నవీన రీతితో గీతిక రాయాలని... దానికి వేగాన్నిచ్చింది కొంపెల్ల సాహిత్యం: ఉత్తేజాన్నిచ్చింది ఉదయినిలో జయభేరి ప్రచురణం. కొత్త బాణీలు రాస్తే ఎవరూ అచ్చు వేయరన్న దిగులును శ్రీశ్రీకి పోగొట్టినవారు కొంపెల్ల. శ్రీశ్రీకి, కొంపెల్లకు ఏ రకమైన భావసారూప్యత లేకున్నా వారి మధ్య స్నేహం మాత్రం చాలా చక్కగా కలిసి పోవడం విశేషం. శ్రీశ్రీ మహా ప్రస్థానాన్ని అంకితమిస్తూ ఇతని గురించి కొంపెల్ల జనార్ధనరావు కోసం కవిత రాశారు. కొంపెల్ల జనార్ధనరావు (1907 - 1937) ప్రముఖ భావకవి, నాటక రచయిత. అతడు 1906 ఏప్రిల్ 15న తూర్పు గోదావరి జిల్లా, కపిలేశ్వరపురం మండలం, మోడేకుర్రులో జన్మించారు. సరికొత్త సాహిత్యం సృష్టించాలన్న ఆవేశం ఆయనది. పుటం పెట్టిన బంగారంలాంటి కవితను కాంక్షించే తత్త్వమది. ఇరవై ఏళ్ళు నిండకుండానే యూరోపియన్ సాహిత్యాన్ని మధించిన మేధస్సు ఆయనది. నాటి మేటి సాహిత్య పత్రిక 'భారతి'లో రెండు పదుల వయసులోనే ఉపసంపాదకుడిగా చేరి, శ్రీశ్రీని కాబోయే మహాకవిగా గుర్తించ గలిగిన గొప్ప పరిశీలకులు. పదునైన విమర్శలు చేయడంలో ఆయనకు ఆయనే సాటి.

శ్రీశ్రీ, కొంపెల్ల మనసులు కలిసిన ఇద్దరూ కలిసి సాహిత్యమే సమస్తమూ అనుకొని తిండీ నిద్రా వదిలి ఎక్కడ వున్నారో ఎక్కడకు పోతున్నారో... తెలియని ఆవేశంతో మద్రాసంతా తిరిగేవారు. హైకోర్ట్ బీచ్, రామకృష్ణ లంచ్ హోం, అడయార్ కన్నెమురా లైబ్రరీ, పరశువాకం ఎగ్మూర్ వీధుల్లో సంచరించే వారు. విశాఖపట్నం లోని 'కవితా సమితి' ద్వారా పురిపండా అప్పలస్వామి సాహచర్యంతో మల్లంపల్లి సోమశేఖర శర్మ ప్రేరణతో భారతి పత్రికలో చేరాడు. భారతి, ఆంధ్రపత్రిక, సుభాషిణి మొదలైన పత్రికలలో దాదాపు 25 కవితా ఖండికలను భావ కవితారీతిలో ప్రచురించాడు. బసవరాజు అప్పారావు 'ఆంధ్ర కవిత్వ చరిత్ర కృష్ణశాస్త్రి 'ప్రవాసం, ఊర్వశి' తల్లావఝ్ఝుల 'అవేదన' లాంటి గ్రంథాల్ని చీల్చి చెండాడే వాడు కొంపెల్ల. స్థానం నరసింహా రావంతటి గొప్ప నటుడి సత్యభామ నటన తేలిపోయిందని ధైర్యంగా ప్రకటించినవాడు కొంపెల్ల. 1934 డిసెంబరులో ఉదయిని అనే ద్వైమాసిక సాహిత్య పత్రికను వెలువరించడం ప్రారంభించాడు. ఇతడు 'తాన్ సేన్', 'తెలుగు' అనే నాటికలు రచించాడు. ఒక గొప్పస్థాయి పత్రికగా 'ఉదయిని' ఉదయించింది. 1934 డిసెంబర్ తొలి సంచిక కొంగొత్త 'కిరణాలు' ప్రసరించింది.' నేను సైతం ప్రపంచాగ్నికి' అంటూ విప్లవాత్మక పంథాలో రాసిన శ్రీశ్రీ కవితను ముద్రించాడు. ఇది నిజంగా శ్రీశ్రీకి కొండంత అండగా నిలిచి, ధైర్యాన్నిచ్చిన నేపథ్యం.

ఉదయిని అనే సాహితీ పత్రికకు సంపాదకత్వం వహించిన కొంపెల్ల... దేవులపల్లి కృష్ణశాస్త్రి, రాయప్రోలు సుబ్బారావు, నోరి నరసింహశాస్త్రి, దామెర రాజగోపాలరావు, ముద్దుకృష్ణ, చింతా దీక్షితులు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, చలం, నేలటూరి వెంకట రమణయ్య, శ్రీరంగం శ్రీనివాసరావు, కొండేపూడి సుబ్బారావు, అడివి బాపిరాజు, తెలికిచెర్ల కృష్ణమూర్తి, కవికొండల వెంకటరావు, కొమఝ్ఝజు వినాయకరావు, కందుకూరి రామభద్రరావు, దువ్వూరి రామిరెడ్డి, శ్రీపాద గోపాల కృష్ణమూర్తి, పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావు, కొడాలి ఆంజనేయులు, కరుణకుమార, వెంపటి నాగభూషణం, పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు, ఆచంట జానకీరాం, కొంపెల్ల జనార్ధనరావు మొదలైనవారి రచనలను ప్రచురించారు. ఉదయిని సాహిత్య పత్రికను ఆయన ద్వై మాసిక పత్రికగా ఆరు సంచికల కన్నా వెలువరించ లేకపోయారు. సాహిత్యానికి ప్రజాభిమానం సంపాదించాలన్న గొప్ప ఆశయంతో అహర్నిశలు పనిచేసి పత్రికను కొనమని వాడవాడలా బిచ్చమెత్తారు. ముద్రణ ఖర్చులు కొంపెల్ల ఇవ్వలేక పోవడంతో ముద్రాపకుడు ఉదయిని ఏడో సంచికను చిత్తు కాగితాలుగా అమ్మేశారు. ఈ అఘాతం తట్టుకోలేక, అనారోగ్యం తీవ్రమై క్షయ వ్యాధితో దుర్భర దారిద్ర్యంలో దీనస్థితిలో ఆయన జూన్ 23, 1937 సంవత్సరంలో క్షయ వ్యాధితో కొంపెల్ల మరణించారు.

ఈ 'మహా ప్రస్థానం' పుస్తకంలోని చాలా కవితలను శ్రీ శ్రీ 1930-40 మధ్య కాలంలో వ్రాసి, మహాప్రస్థానాన్ని శ్రీ శ్రీ ఆయన మిత్రుడు శ్రీ కొంపెల్ల జనార్ధనరావు గారికి అంకితం చేసారు. ఆ అంకిత వాక్యాలు కూడా కవితా రూపంలోనే స్వయంగా శ్రీ శ్రీ నే వ్రాశారు. తలవంచుకు వెళ్ళిపోయావా, నేస్తం! సెలవంటూ ఈ లోకాన్ని వదిలి... తలపోసిన వేవీ కొనసాగక పోగా, పరివేదన బరువు బరువు కాగా, అటు చూస్తే, ఇటు చూస్తే ఎవరూ చిరునవ్వు, చేయూతా ఇవ్వక... మురికితనం కరుకుతనం నీ సుకుమారపు హృదయానికి గాయం చేస్తే... అటు పోతే, ఇటు పోతే అంతా అనాదరణతో, అలక్ష్యంతో చూసి, ఒక్కణ్ణి చేసి వేధించారని, బాధించారని వెక్కి వెక్కి ఏడుస్తూ వెళ్ళిపోయావా, నేస్తం! దొంగ లంజకొడుకు లసలే మెసలే ఈ ధూర్తలోకంలో నిలబడ జాలక తలవంచుకునే వెళ్ళిపోయావా, నేస్తం! చిరునవులనే పరిషేచన చేస్తూ... బరంపురంలో మనం ఇంకా నిన్న గాక మొన్న మాట్లాడుతున్నట్టే ఉంది! కాకినాడ నవ్య సాహిత్య పరిషత్తును కలకలలాడించిన నీ నవ్వు కనబడకుండా కరిగిపోయిందా ఇంతట్లోనే! విశాఖ పట్టణం వీధుల్లో మనం "ఉదయిని" సంచికలు పట్టుకు తిరగడం... ఎవరు దుఃఖించారులే నేస్తం! నువ్వు చనిపోతే, ఏదో నేనూ, ఆరుగురు స్నేహితులూ తప్ప... లేదు నేస్తం! లేదు... నీ ప్రాభవం మమ్మల్ని వదలలేదు.. నిరుత్సాహాన్ని జయించడం నీ వల్లనే నేర్చుకుంటున్నాము.. నీ సాహసం ఒక ఉదాహరణ.. నీ జీవితమే ఒరవడి.. నిన్న వదలిన పోరాటం నేడు అందుకొనక తప్పదు.. కావున ఈ నిరాశామయ లోకంలో కదనశంఖం పూరిస్తున్నాను.. ఇక్కడ నిలబడి నిన్ను ఇవాళ ఆవాహనం చేస్తున్నాను.. అందుకో ఈ చాచిన హస్తం.. ఆవేశించు నాలో.. ఇలా చూడు నీ కోసం.. ఇదే నా మహాప్రస్థానం..

## రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు

**పులివెందుల :** బాపట్ల మండలం ఈపురుపాలెం పంచాయతీసీతారాంపేటలో నిన్న తెల్లవారుజామున జరిగిన అత్యాచారం దుర్ఘటన అమానుషమని ఏపీ సిసి మీడియా చైర్ మెన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం ఆయన వేంపల్లిలో మాట్లాడుతూ. యువతిని కర్రలతో కొట్టి, అత్యాచారం చేసి చంపి రైల్వే ట్రాక్ వద్ద పడేయడం బాధాకరమని ఆవేదన చెందారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని, అసాంఘిక శక్తులు పెట్రేగిపోతున్నాయన్నారు. వాటిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని కోరారు.

## కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు

**నర్సీపట్నం :** నర్సీపట్నం మున్సిపాలిటీ 6వ వార్డు గవరపాలెంలో నిర్మించిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది తెలిపారు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనంలో కనీస మౌలిక సదుపాయాలు లేవని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా లేక అనేక వైద్య పరీక్షల పరికరాలు ఉపయోగించలేకపోతున్నామని సిబ్బంది తెలిపారు. ఉన్నతాధికారులు సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు.

# ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం..










**రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్**

**కర్నూల్లో టి.జి లక్ష్మీ వెంకటేష్ వాసవి వైశ్య హాస్టల్ నూతన ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టి.జి భరత్, మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి వెంకటేష్**

**కర్నూలు, జూన్ 23 (పీపుల్స్ మోటివేషన్):-**

ఆర్యవైశ్యులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని నంద్యాల రోడ్డులో ఉన్న టి.జి లక్ష్మీ వెంకటేష్ వాసవి వైశ్య హాస్టల్ నూతన ప్రారంభోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి వెంకటేష్ దంపతులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాస్టల్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టి.జి భరత్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఆర్యవైశ్యులంటే రోశయ్య తర్వాత టి.జి వెంకటేష్ గుర్తొస్తారని చెప్పారు. ఆర్యవైశ్యులకు మంచి చేసేందుకు తామెప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. విద్యాదానం ఎంతో గొప్పదన్నారు. వైశ్య హాస్టల్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమ టి.జి.వి సంస్థల తరుపున దశాబ్దాలుగా ప్రజలకు సేవ చేస్తూనే ఉన్నట్లు టి.జి భరత్ తెలిపారు. తమ సేవలు ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటాయన్నారు. అనంతరం మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి వెంకటేష్ మాట్లాడుతూ తాను మొదటి నుండీ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేసినట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో ఆర్యవైశ్యులను బానిసలుగా చూసేవారన్నారు. దివంగత నాయకుడు రోశయ్యతో కలిసి ఆర్యవైశ్యుల ఎన్నో సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. ఆర్యవైశ్యులను బానిసలుగా చూసే నాయకులకు గుణపాఠం చెబుతూ వైశ్యులకు తగిన గౌరవం కల్పించినట్లు గుర్తు చేశారు. అంతేకాకుండా చదువుకున్న వారికి ఉద్యోగాలు, చదువులేని వారికి ఉపాధి కల్పించి ఆదుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యుల ఆస్తులను పలువురు కాజేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. అలాంటి వారి నుండి ఆస్తులు రక్షించి ఆర్యవైశ్య కమ్యూనిటీ సొంతం చేసేందుకు కృషి చేస్తూనే ఉన్నామని చెప్పారు. పార్టీలతో సంబంధం లేకుండా ఆర్యవైశ్యులందరూ ఒక కుటుంబంలా ఉండాలని టి.జి వెంకటేష్ కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, దేవకీ వెంకటేశ్వర్లు, సిద్దా నాగేశ్వరరావు, పెనుగొండ సుబ్బరాయుడు, ఇల్లూరు లక్ష్మయ్య, టి.జి శివరాజు, అమరవాది లక్ష్మీనారాయణ, కోటా సత్యనారాయణ, రజిని, శబరి వరప్రసాద్, రాయపూడి గణేష్, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# రహదారికి అడ్డంగా అక్రమ కట్టడాలు





**గ్రామస్తులంతా ఏకమై రహదారికి అడ్డంగా ఉన్న అక్రమ కట్టడాలు కూల్చివేత**

**పోలీసులు విచారణ చేయకుండా 20 మందిపై కేసు బనాయించడం అన్యాయం**

**దేవనకొండ, జూన్ 23 (పీపుల్స్ మోటివేషన్):-**

దేవనకొండ మండలం జిల్లెడుబుడకల గ్రామంలో గత 20 సంవత్సరాలు పైగా రామాంజనేయులు తదితర వ్యక్తుల ఇంటి ముందు నుంచి బుర్రకుంటకు ప్రధాన రహదారి ఉండేది. ఈ రహదారిలోనే మొహరానికి సంబంధించి పీర్ల దేవుళ్ళు, మరియు గ్రామంలో వెలిసిన చాలా దేవాలయాలకు, మారెమ్మ బోనాలకు వెళ్లడానికి,చనిపోయిన వ్యక్తులను స్మశానానికి తీసుకు వెళ్ళటానికి కూడా ఈ రహదారే ఉండేది. అయితే ప్రస్తుతం ఈ రహదారి లేకుండా అక్రమ కట్టడాలు కట్టడం వలన చాలా ఇబ్బందులు పడే అవకాశం ఉందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి లేకపోతే గ్రామం చుట్టూ స్మశానాన్ని తీసుకువెళ్లాల్సి వస్తుంది అలా తీసుకువెళ్తే గ్రామానికి అరిష్టమని కూడా ప్రజలు ఆరోపిస్తున్నారు. అన్ని విధాలుగా ఈ రహదారి ఉపయోగకరంగా ఉండేది.ఈ రహదారి కోసం పక్కన ఉన్న గృహాల వారు కూడా చాలావరకు రహదారికి అడ్డు చెప్పకుండా రహదారికి స్థలం వదిలారు అయితే రామాంజనేయులు అనే వ్యక్తి ఈ రహదారికి స్థలం వదలటం లేదు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ రామాంజనేయులు అనే వ్యక్తి రహదారి ఉన్న స్థలాన్ని ఆక్రమించుకొని పూర్తిగా అడ్డంగా కనీసం వ్యక్తులు తిరగటానికి కూడా ఇబ్బందిగా ఉండే విధంగా ఇంటి ముందు కాంపౌండ్ నిర్మాణం చేపట్టడం న్యాయం కాదన్నారు. గ్రామ ప్రజలంతా కలిసి మెలిసి ఉండేవాళ్ళమన్నారు అయితే ఈ అక్రమ కట్టడాల వలన గొడవలకు దారి తీసే అవకాశం ఉందన్నారు. గ్రామ ప్రజల సమస్యను కొందరు వ్యక్తులు రాజకీయం చేయడం సమంజసం కాదన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి కూడా ఈ కట్టడం సరైనది కాదని రామాంజనేయులు అనే వ్యక్తికి నోటీసులు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. అయితే ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చిన దాన్ని పట్టించుకోకుండా రహదారికి అడ్డుగా కాంపౌండ్ వాల్ నిర్మాణం కట్టడం జరిగిందన్నారు. గ్రామ ప్రజలంతా కలిసి రెవెన్యూ డిపార్ట్మెంట్ ఇచ్చిన నోటీసులను, పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన నోటీసులు ఆధారంగా చేసుకొని రహదారికి అడ్డుగా ఉన్న అన్ని అక్రమ కట్టడాలు అన్ని కూడా పడగొట్టడం జరిగింది. రామాంజనేయులు అనే వ్యక్తి కాంపౌండ్ వాల్ నిర్మాణం ఒకటే కాకుండా రహదారికి అడ్డుగా ఉన్న కట్టడాలు అన్ని కూడా గ్రామస్తులు తొలగించారు. ఈ తొలగించిన వాటికి ఎవరు కూడా అభ్యంతరం చెప్పటం లేదు. కేవలం రామాంజనేయులు అనే వ్యక్తి మాత్రమే అభ్యంతరం చెప్పటం ద్వారా గ్రామంలో గొడవలు సృష్టిస్తున్నారని గ్రామ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. తన పొలం ముందు ఉన్న ఆర్ అండ్ బి రోడ్డుకు రహదారి వేయకుండా రామాంజనేయులు ఒకప్పుడు అడ్డుపడడం ద్వారా అక్కడ రోడ్డు వేయకుండా చేశారన్నారు.గ్రామ ప్రజలపై రామాంజనేయులు అనే వ్యక్తి చంపుతానని బెదిరిస్తున్నాడు అని అన్నారు. గ్రామ ప్రజలందరూ కలిసి ఇలా కట్టడం న్యాయం కాదని అడిగితే రామాంజనేయులు అసభ్య పదజాలాలతో దూషించడం జరిగిందన్నారు.గ్రామ ప్రజలు ఏకమై అక్రమ కట్టడాన్ని కూల్చితే దేవనకొండ పోలీసులు 20 మంది కి పైగా కేసు నమోదు చేయడం అన్యాయం అన్నారు. పోలీసులు గ్రామంలో ఎలాంటి విచారణ చేపట్టకుండా కేసులు నమోదు చేయటం న్యాయం కాదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ రహదారి సమస్యను అధికారులు తొందరగా పరిష్కరించకపోతే ప్రాణాలు పోయే అవకాశాలు ఉన్నాయని గ్రామ ప్రజలు ఆవేదనతో బాధపడ్డారు.

## అతిసారం వల్ల మృతి కుటుంబాన్ని కుటుంబాన్ని ఆదుకోండి





**జూపాడుబంగ్లా, జూన్ 23 (పీపుల్స్ మోటివేషన్) :**

జూపాడు బంగ్లా మండలం చాబోలు గ్రామంలో మూడు రోజులుగా అతిసారం ప్రజలడంతో నాగన్న అనే వ్యక్తి మృతి చెందాడని నందికొట్కూరు సిపిఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పంచాయతి అధికారుల పర్యవేక్షణ లోపం నిర్లక్ష్యం వల్ల కలుషితమైన నీరు తాగడం వల్ల చాబోలు గ్రామంలో దాదాపు 30 మందికి పైగా అతిసారంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నాడు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే ముఖ్యంగా దళితవాడలో ఈ విధంగా జరుగుతుంది అని ఇలాంటి అధికారులపై తక్షణమే చర్యలు తీసుకొని సస్పెండ్ చేసి వారిని ప్రభుత్వానికి సరెండర్ చేయాలని వారు అన్నారు. అంతేకాక ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతుడి కుటుంబానికి 50 లక్షల ఎక్స్గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం 5 ఎకరాల పొలం ఇవ్వాలని స్థానిక జూపాడు మండల ఎమ్మార్వో కార్యాలయం నందు నాగన్న మృతదేహాన్ని ఉంచి కుటుంబానికి న్యాయం చేయాలని డిప్యూటీ కలెక్టర్ ఆర్డిఓ దాస్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దిలీప్ రాజ్, నరసింహుడు, దినేష్ వెంకటేశ్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

**ఎమ్మెల్యే గిత్త జయ సూర్య మాండ్ర శివానందరెడ్డి**

**జూపాడుబంగ్లా, జూన్ 23 (పీపుల్స్ మోటివేషన్):-**





జూపాడు బంగ్లా మండలం చాబోలు గ్రామంలో అతిసారంతో మృతి చెందిన నాగన్న మృతదేహానికి ఎమ్మెల్యే గిత్త జయ సూర్య, మాండ్ర శివానందరెడ్డి ఆదివారం పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో చాబోలు గ్రామంలో ఎటువంటి తాగునీటి సరఫరా సమస్యను పరిష్కరించలేదని వారు మండిపడ్డారు. ఈ సమస్యను తక్షణమే సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి గ్రామంలో ఉన్న ప్రజలకి జూపాడు బంగ్లాలో ప్రతి ఒక్కరికి రెండు సెంట్లు స్థలం ఇప్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, గిరీష్ రెడ్డి, జూపాడు బంగ్లా మండలం కన్వీనర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, బన్నూరు గ్రామం పరమేశ్వర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, పెద్దన్న శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పత్తికొండ డివిజన్ టెక్నికల్ అసిస్టెంట్ నూతన కమిటీ ఎన్నిక

**పత్తికొండ, జూన్ 23 (పీపుల్స్ మోటివేషన్):-**



(ఎన్ఆర్ఈజీఎస్) జాతీయ గ్రామీణ గ్రామీణ ఉపాధి హామీ పథకం పత్తికొండ డివిజన్ టెక్నికల్ అసిస్టెంట్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.ఆదివారం స్థానిక సాయిబాబా దేవాలయం నందు పత్తికొండ డివిజన్లో ఉన్న టెక్నికల్ అసిస్టెంట్లు సమావేశం నిర్వహించుకొని నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పత్తికొండ డివిజన్ అధ్యక్షులుగా ఎల్. మహేష్,ఉపాధ్యక్షులు గా కే.మారుతి, సెక్రటరీ గా రాముడు,కోశాధికారిగా సుధాకర్ లను ఎన్నుకున్నారు.వీరితోపాటు డివిజన్లో ఉన్న తొమ్మిది మండలాలను సంబంధించిన కమిటీలను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో నాగన్న,ఉల్లిగప్ప,కృష్ణమూర్తి, శివరాజు తదితల పాల్గొన్నారు.


తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

# కల్కి ట్రైలర్ చూసి రామ్ ఫిదా

మరో 5 రోజుల్లో ప్రభాస్ కల్కి సందడి మొదలు కానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన టీజర్‌తో పాటు ట్రైలర్‌లు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా మేకర్స్ రిలీజ్ ట్రైలర్ విడుదల చేశారు. ఇక ఈ రిలీజ్ ట్రైలర్‌లో ఓ కొత్తలోకాన్ని ఆవిష్కరించాడు దర్శకుడు నాగ్‌అశ్విన్. ఇప్పటివరకూ వచ్చిన భారతీయ సినిమాలన్నీ ఒకెత్తు.. 'కల్కి 2898' ఒకెత్తు అనేలా ఉంది ఈ కొత్త ట్రైలర్. అయితే ఈ ట్రైలర్ చూసిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఫిదా అవ్వడంతో పాటు ప్రశంసల వర్షం కురిపించాడు. అలాగే నెటిజన్లకు ఈ ట్రైలర్‌పై ఒక టాస్క్‌ను ఇస్తూ.. ఒక పజిల్‌ను పోస్ట్ చేశాడు. ఒక సెంటెన్స్ ఇచ్చి అందులో కొన్ని లెటర్స్‌ను మిస్ చేశాడు. ఈ పజిల్‌ను ఎవరైతే ముందుగా ఫిల్ చేస్తారో వాళ్లకి లక్ష రూపాయలను బహుమతిగా ఇస్తానని చెప్పాడు.




# కల్కిలో విజయ్ దేవరకొండ కూడా ఉన్నాడా ?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం కల్కి. ఈ సినిమా జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు ఇంకా 5 రోజులే ఉండడంతో ప్రమోషన్స్ గట్టిగా చేస్తున్నారు మేకర్స్. ఇప్పటికే టీజర్‌తో పాటు ట్రైలర్‌లు విడుదల చేయగా ఆకట్టుకున్నాయి. ఇదిలావుంటే శుక్రవారం రిలీజ్ ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ యూట్యూబ్‌లో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. అయితే ఈ కొత్త ట్రైలర్‌లో మాళవికనాయర్?ను చూపించి సర్?ప్రైజ్ ఇచ్చారు మేకర్స్. ఇప్పుడు తాజాగా ఈ మూవీకి సంబంధించి ఒక సాలిడ్ రూమర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ సినిమాలో రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ నటిస్తున్నట్లు తెలుస్తుంది. అశ్వథామ(కుంజరం)ను ఎదుర్కొనే పాత్రలో విజయ్ కనిపించబోతున్నట్లు నెట్టింట వార్తలు వైరల్ అవుతున్నాయి. దీనిపై మేకర్స్ ఎటువంటి క్లారిటీ ఇవ్వలేదు.

# నక్కిన దర్శకత్వంలో సందీప్ కిషన్

దర్శకుడు నక్కిన త్రినాథ రావు, రచయిత బెజవాడ ప్రసన్న కుమార్ మళ్ళీ చేతులు కలిపి ఒక సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తుండగా, ఇంకొక ప్రధాన పాత్రలో రావు రమేష్ నటిస్తున్నారు. రీతు వర్మ, అన్షు అంబానీ లు సందీప్, రావు రమేష్ పక్కన జోడీగా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ఇప్పుడు హైదరాబాదులో అవుతోంది. ఇందులో సందీప్ కిషన్, రీతు వర్మ, అన్షు అంబానీ, ఇంకా మరికొంతమంది ఆర్టిస్టులు వున్నారని కూడా తెలిసింది. అయితే ఈ సినిమాకి ఇంతవరకు ఎటువంటి టైటిల్ పెట్టలేదు, ఈ సినిమా అధికారికంగా ప్రకటించినప్పుడు కేవలం ÷ూఐ30 అని మాత్రమే అన్నారు. అయితే ఇప్పుడు ఈ సినిమాకి టైటిల్ ఖరారు అయినట్టుగా తెలుస్తోంది. ఇంతకు ముందు నక్కిన త్రినాథ రావు, రవి తేజ కాంబినేషన్ లో 'ధమాకా' సినిమా విజయవంతమై రూ.100 కోట్లకి పైగా కలెక్టు చేసిందని తెలుసు కదా. ఇప్పుడు ఈ సందీప్ కిషన్ సినిమాకి కూడా అలాంటి టైటిల్ ఉంటే బాగుంటుంది అని నక్కిన త్రినాథ రావు, బెజవాడ ప్రసన్న కుమార్ ఇద్దరూ అనుకున్నారు. అందుకే ఈ సినిమాకి 'మజాకా' అని టైటిల్ పెడుతున్నట్టుగా తెలిసింది. ఈ విషయాన్ని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు, కానీ కొన్ని రోజుల్లో ఈ సినిమా టైటిల్ రెవీల్ చెయ్యొచ్చు అని తెలిసింది. రాజేష్ దండ ఈ సినిమాకి నిర్మాత.



Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com